సాక్షి వికారాబాద్

శనివారం । 18 । జనవరి । 2025



పాత దరఖాస్తులకే మొగ్గు

కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు తాజా సర్వేతో కొంత ఉపశమనం లభించింది. 8లో▸



నయా దందా!

బషీరాబాద్ మండలం కొర్విచెడ్ రెవెన్యూ పరిధిలో నాపరాతి గని భూములు చదును చేసేపనులు జోరుగా సాగుతున్నాయి. 8లో▸



దళారులను నమ్మొద్దు

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో దళారులను నమ్మొద్దని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

క్రీడలతో మానసికోల్లాసం

ఎస్పీ నారాయణరెడ్డి



టాస్ వేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: క్రీడలతో మానసిక ప్రశాంతతతోపాటు శారీరక ధారుఢ్యానికి ఎంతో దోహదపడతాయని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు చేశారు. ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో సమయస్ఫూర్తి, స్నేహభావం పెంపొందుతుందన్నారు. ఆటల్లో గెలుపోటములు సాధరణమని.. ఓటమి గెలుపునకు నాంది కావాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ టీవీ హనుమంతరావు, డీఎస్పీలు జానయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వీరేష్, సీఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

కొడంగల్: పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. యువజన కాంగ్రెస్ జాతీయ కో ఆర్డినేటర్ కృష్ణంరాజు ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన బృందాలు పోటీల్లో పాల్గొన్నాయి. డే అండ్ నైట్ జరిగే పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులు అందజేస్తారు. మొదటి బహుమతి కింద రూ.30వేలు, రెండో బహుమతి కింద రూ.20 వేలు, మూడో బహుమతి కింద రూ.10వేలు, నాలుగో బహుమతి కింద రూ.5వేలు ఇవ్వనున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నయీమ్, ఆనంద్‌రెడ్డి, సంజీవరెడ్డి, బాల్‌రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మకానికి బాలిక.. అడ్డుకున్న ఐసీడీఎస్

మర్పల్లి: అమ్మకానికి పెట్టిన ఓ బాలికను ఐసీడీఎస్ అధికారులు రక్షించిన ఘటన మండల పరిధిలోని ఘణాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. మర్పల్లి ఐసీడీఎస్ సూపర్ వైజర్ రిజ్వాన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ ఏడేళ్ల బాలికను అమ్మకానికి పెట్టినట్లు 100 సమాచారం వచ్చింది. ఈ విషయమై పోలీసులు మర్పల్లి ఐసీడీఎస్ సీడీపీఓ ప్రవీణకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె అప్రమత్తమై స్థానిక ఐసీడీఎస్ సూపర్ వైజర్ రిజ్వాన, ఘణాపూర్ అంగన్‌వాడీ వర్కర్ విజయలక్ష్మికి సమాచారం చేరవేశారు. వెంటనే వారు స్పందించి సదరు బాలికను సంరక్షించారు. అనంతరం చిన్నారిని వికారాబాద్ పట్టణంలోని శిశు గృహంలో చేర్పించినట్లు ఐసీడీఎస్ సూపర్ వైజర్ రిజ్వాన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన

కొత్తూరు: జేపీదర్గా ఉర్సులో భాగంగా రెండో రోజు శుక్రవారం దీపారాధన ఘట్టం ముగిసింది. ఇందులో భాగంగా స్థానికులతో పాటు హైదరాబాద్, ఆయా ప్రాంతాలకు చెందిన మహిళలు దర్గా ఆవరణలో దీపాలు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బాబా దర్శనం కోసం ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఇబ్బంది పడకుండా వక్ఫ్‌బోర్డు అధికారులు ఏర్పాట్లు చేశారు.

సాగుకు పనికిరాని భూముల పరిశీలన

రంగారెడ్డి వ్యవసాయాధికారి నరసింహారావు

చేవెళ్ల/మొయినాబాద్: రైతు భరోసా పథకం సర్వేలో భాగంగా సాగుకు ఉపయోగపడని భూములను పరిశీలిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి నరసింహారావు తెలిపారు. చేవెళ్ల మండల పరిధిలోని తంగడపల్లిలో శుక్రవారం రెవెన్యూ, వ్యవసాయాధికారులతో కలిసి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో సర్వే నిర్వహించి సాగుకు పనికిరాని భూములను గుర్తిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో మొత్తం ఎన్ని ఎకరాల భూమి ఉంది.. అందులో సాగు భూమి ఎంత..? ప్రభుత్వ భూమి ఎంత..? సాగుకు పనికి రాని భూమి ఎన్ని ఎకరాలు..? అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 20 నాటికి అన్ని గ్రామాల్లో సర్వే పూర్తవుతుందన్నారు. ఆయన వెంట తహసీల్దార్ కృష్ణయ్య, చేవెళ్ల డివిజన్ వ్యవసాయాధికారి సురేష్‌బాబు, ఏఓ శంకర్‌లాల్ ఉన్నారు.



వికారాబాద్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రానికి వచ్చిన పత్తి

భారీగా బకాయిలు

గతేడాది నవంబరులో పత్తి కొనుగోళ్లు ప్రారంభం

- ఇప్పటి వరకు సేకరించింది 1,25,677 మెట్రిక్ టన్నులు
- చెల్లించాల్సిన డబ్బు రూ.932 కోట్లు
- రైతుల ఖాతాల్లో జమ అయిన మొత్తం రూ.292 కోట్లు
- బకాయిలు రూ.640 కోట్లు
- ముగింపు దశకు కొనుగోళ్ల ప్రక్రియ

వికారాబాద్: జిల్లాలో పత్తి రైతుకు చెల్లించాల్సిన బకాయిలు భారీగా పేరుకుపోయాయి. ఓ పక్క ఈ నెలాఖరు వరకు పత్తి కొనుగోలు చేస్తామని అధికారులు చెబుతూనే సెంటర్లను మూసేస్తున్నారు. జిల్లాలో గత ఏడాది నవంబరు మొదటి వారంలో సీసీఐ ఆధ్వర్యంలో 14 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నాలుగు మినహా మిగతావి మూతపడ్డాయి. దాదాపు కొనుగోలు ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంది. డబ్బుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. కేంద్రాలను ప్రారంభించింది మొదలు పదే పదే మూసివేయడం తర్వాత తెరవటం వంటివి చేశారు. మిల్లర్లు వ్యాపారులు తెచ్చిన పత్తిని దించుకుంటూ రైతులకు మాత్రం స్థలం లేదని.. రెండు మూడు రోజుల తర్వాత రావాలని సెంటర్లు మూసి వెళ్తున్నారు. దీంతో దళారులకు పత్తి విక్రయించుకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాలకు భారీగా పత్తి వస్తున్న సమయంలో సెంటర్లను మూసివేసి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో 2.3 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రాగా ఇప్పటి వరకు 1,25,677 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు.

కొన్నది సగమే..

సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోలు లక్ష్యం బారెడు, సేకరణ మూరెడు అన్న చందంగా తయారైంది. జిల్లాలో 14 కేంద్రాలను ఏర్పాటు చేశారు. తాండూరు, వికారాబాద్, పరిగి ప్రాంతాల్లో మూడు చొప్పున, మర్పల్లి, కోట్‌పల్లి, ధారూరు, కొడంగల్, పూడూరులో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేశారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 2.30 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేయగా.. ఒక్కో ఎకరాకు సగటున 10 క్వింటాళ్ల చొప్పున మొత్తం 2.3లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇప్పటి వరకు 54వేల మంది రైతుల నుంచి 1,25,677 మెట్రిక్ టన్నుల పత్తిని మాత్రమే కొనుగోలు చేశారు.

రూ.100 తగ్గించి కొనుగోలు

కేంద్ర ప్రభుత్వం క్వింటాలు పత్తికి రూ.7,521 మద్దతు ధర నిర్ణయించింది. అయితే ఆ ధరలో వంద రూపాయలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులు, జిన్నింగ్ మిల్లులు, బహిరంగ మార్కెట్‌లో క్వింటాలుకు రూ.6,500కు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రూ.1000 వరకు నష్టపోతున్నారు. బహిరంగ మార్కెట్‌లో పత్తి విక్రయిస్తే వెంటనే డబ్బులు ఇస్తుండటంతో రైతులు అటువైపే మొగ్గుచూపుతున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో కొర్రీల కారణంగా ఆసక్తి చూపడంలేదు. పొట్టి పింజ, పొడుపు పింజ రకం అనే తేడాతో ధర తగ్గిస్తున్నారు. వాతావరణ పరిస్థితులతో కొద్దిగా రంగు మారిగా పత్తిని తిప్పి పంపుతున్నారు. ఇదిలా ఉండగా రైతులకు చెల్లించాల్సిన బకాయిలు భారీగా పెరిగిపోతున్నాయి. 1,25,677 మెట్రిక్ టన్నులకు సంబంధించి రూ.932 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.292 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. మరో రూ.640 కోట్లు చెల్లించాల్సి ఉంది. వెంటనే డబ్బు జమ చేయాలని రైతులు కోరుతున్నారు.



కొడంగల్: సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

పనుల్లో నాణ్యత ఉండాలి

- కలెక్టర్ ప్రతీక్ జైన్

కొడంగల్: రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని.. ప్రజా అవసరాలకు ఇబ్బంది లేకుండా పనులు చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని పంచాయతీ రాజ్, రోడ్డు భవనాల శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పట్టణంలోని కడా కార్యాలయంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణాలు చేపట్టే క్రమంలో సంబంధిత శాఖల ఇంజనీర్లు తనిఖీలు చేయాలన్నారు. పనులు చేసే క్రమంలో నీటి సరఫరా పైప్‌లైన్, విద్యుత్ స్తంభాలు మార్చేందుకు అయ్యే ఖర్చులకు నివేదికలు తయారు చేయాలన్నారు. నీటి సరఫరా చేసే పైపులపై రోడ్డు నిర్మాణం చేపట్టరాదని సూచించారు. పనులను హడావుడిగా కాకుండా పకడ్బందీగా చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలను ముందస్తుగా తొలగించుకొని పనులు చేపట్టాలన్నారు. అటవీ ప్రాంతంలో వేసే రోడ్ల గురించి ఉన్నతాధికారులతో చర్చించాలన్నారు. కడా ఆధ్వర్యంలో చేపట్టిన పనులను మంజూరు చేసినప్పటికీ గ్రౌండింగ్ కాని పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ వసంత్‌నాయక్, విద్యుత్ శాఖ ఎస్ఈ నీలవతి, మిషన్ భగీరథ ఎస్ఈ జగన్మోహన్, జిల్లా అటవీ అధికారి జ్ఞానేశ్వర్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ డీఈలు, ఈఈలు పాల్గొన్నారు.

రెండ్రోజుల్లో సర్వే పూర్తి కావాలి

అనంతగిరి: నాలుగు ప్రతిష్టాత్మక పథకాల అమలు కోసం చేపట్టిన సర్వే ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని మండలాల తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు, ఎంపీడీఓలు, స్పెషల్ ఆఫీసర్లతో మాట్లాడారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వే చేపట్టినట్లు తెలిపారు. ప్రతి నిరుపేదకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే దిశగా జిల్లా యంత్రాంగం పనిచేయాలన్నారు. రైతు భరోసాకు సాగులో ఉన్న భూముల వివరాలు వ్యవసాయానికి అనువుగా లేని భూములు అలాగే నాలాలు, కన్వర్షన్ అయిన భూములు, రియల్ ఎస్టేట్ భూములు, మైనింగ్ చేస్తున్న భూములు, ప్రభుత్వం ప్రాజెక్టులు కొరకు తీసుకున్న భూముల వివరాలను ఎలాంటి పొరపాటుకు తావులేకుండా పకడ్బందీగా నమోదు చేయాలన్నారు.. ఫామ్ ప్లాట్స్, ఫామ్ హౌస్‌లను గుర్తించి సర్టిఫికెట్ ఇవ్వాలని, సర్వేలో ఏమైనా సమస్య వస్తుందా వస్తే కారణాలను రాయాలని సూచించారు. సర్వే ప్రక్రియను 20వ తేదీ నాటికి పూర్తి చేసి 21 నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు, వార్డు సభలు నిర్వహించి అర్హుల జాబితాను సిద్ధం చేయాల్సి ఉంటుందని తెలిపారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం సర్వే, గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీఏ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, డీపీఓ జయసుధ, డీఎస్ఓ మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సిబ్బంది నుంచి సర్వే వివరాలు తెలుసుకుంటున్న లింగ్యానాయక్

సర్వే పారదర్శకంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ధారూరు: మండలంలోని ఎబ్బనూర్‌లో రేషన్‌కార్డుల సర్వే ప్రక్రియను శుక్రవారం అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ పరిశీలించారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు. పాత రేషన్ కార్డులతో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు సక్రమంగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. సర్వే పారదర్శకంగా ఉండాలని, అర్హులకు ప్రయోజనం చేకూరేలా సర్వే నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ సాజిదాబేగం, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ పాల్గొన్నారు.

వ్యవసాయేతర భూముల పరిశీలన

మండల కేంద్రంలోని వ్యవసాయ భూముల్లో వెలిసిన కాలనీలను శుక్రవారం అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీఓ వాసుచంద్ర, జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, తహసీల్దార్ సాజిదాబేగం పరిశీలించారు. వీటికి గతంలో రైతుబంధు వచ్చిందా అని ఏఈఓలను ప్రశ్నించగా వచ్చిందనే సమాధానం ఇచ్చారు. ఇకనుంచి సాగుకు యోగ్యమైన భూములకు మాత్రమే రైతుభరోసా వస్తుందని పేర్కొన్నారు. వ్యవసాయేతర భూములను గుర్తించడంలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. ఆయన వెంట ఏఈఓలు సంజూరాథోడ్, సంతోష్ ఉన్నారు.

తూకం.. మోసం!

- రాళ్లే కొలమానంగా..
- వినియోగదారులకు తప్పని బాధలు
- ఎలక్ట్రానిక్ కాంటాల్లోనూ ఇదే పరిస్థితి

పరిగి: కిరాణా దుకాణాల్లోని కొన్ని వస్తువులపై ఎమ్మార్పీ, తయారీ, ఎక్స్‌పైరీ తేదీలు, నెట్ వెయిట్ వివరాలు లేకుండానే విక్రయిస్తున్నారు. పెట్రోల్ బంకుల్లో ఇంధనం నాణ్యత పరిశీలించేందుకు ఉపయోగించే ఫిల్టర్ పేపర్‌ను అందుబాటులో ఉంచడం లేదు. వ్యాపార, వాణిజ్య కేంద్రాల్లో ముద్రలేని తూకం రాళ్లు, తూకాల్లో తేడా ఉంటోంది. జిల్లా వ్యాప్తంగా చాలా షాపుల్లో ఇలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయి. అయినా తూనికలు కొలతల శాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నష్టపోతున్న వినియోగదారులు

జిల్లాలోని కిరాణా షాపులు, సూపర్ మార్కెట్లు, కూరగాయల దుకాణాలు, పంట కొనుగోలు కేంద్రాల్లో త్రాసు, ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లను వినియోగిస్తున్నారు. నిబంధనల ప్రకారం వ్యాపారులు వినియోగించే బాట్లు, ఎలక్ట్రానిక్ కాంటాలకు లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీ చేసి రెండేళ్ల కాల పరిమితితో లైసెన్సులు జారీ చేయాలి. నిబంధనలు పాటించని వారికి జరిమానా విధించాలి. అయితే జిల్లాలో ఎక్కడా ఈ పద్ధతి అమలు కావడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. కిరాణా దుకాణాలు, బహిరంగ ప్రదేశాల్లో వ్యాపారం చేసేవారు ఒక్కో కిలోకు 150 గ్రాముల నుంచి 200 గ్రాముల వరకు తూకంలో మోసాలకు పాల్పడుతున్నారు. ముద్ర లేని బాట్లు, తూకం మిషన్లను వినియోగిస్తున్నారు. దీంతో వినియోగదారులు నష్టపోతున్నారు.

ఎలక్ట్రానిక్ కాంటాలతో కుచ్చుటోపీ

చాలా చోట్ల వ్యాపారులు ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లను వినియోగిస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నారు. వేయింగ్ మిషన్లకు మెట్రాలజీ అధికారులు నుంచి లైసెన్సు పొందాలి. వాటికి వేసిన సీల్‌ను తొలగించరాదు. దుకాణాల్లో ఎలక్ట్రానిక్ కాంటాలు, బాట్లను అందుబాటులో ఉంచాలి. వినియోగదారులకు అనుమానం వస్తే బాట్లతో తూకం చూపించాలి. వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ కాంటా సామర్థ్యంలో పదిశాతం మేరకు బాట్లు అందుబాటులో ఉండాలి. జిల్లాలో ఇటువంటి పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. తుకాల్లో హెచ్చుతగ్గులు రావడానికి వ్యాపారులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. సీల్ లేని వేయింగ మిషిన్లను వినియోగిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

జిల్లాలోని పలు మండలాలు, పట్టణాల్లో ప్యాక్ చేసిన పదార్థాలను విక్రయిస్తున్నారు.. కానీ వాటిపై తయారీ తేదీ, గడువు తేదీ, ధర వివరాలు ఉండటం లేదు. పాడైన, ముక్క వాసన వస్తున్న వాటిని కూడా విక్రయించి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. కల్తీ పదార్థాలు, తూకాల్లో మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.



సంతలో రాళ్లే బాట్లుగా కూరగాయలను తూకం వేస్తున్న వ్యాపారి

చర్యలు తీసుకోవాలి



కిరణా దుకాణాలు, పెట్రోల్ బంకుల్లో నిబంధనలు పాటించడం లేదు. తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. సంతల్లో కూడా రాళ్లతో తూకం వేస్తున్నారు. దీంతో వినియోగదారులు నష్టపోతున్నారు. అధికారులు తనిఖీలు చేపట్టి తూకాల్లో మోసాలను అరికట్టాలి.

– మల్లేశ్, మిట్టకోడూర్

హామీల అమలులో విఫలం

- కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన నేతలు
- షాబాద్‌లో బీఆర్ఎస్ రైతు దీక్ష
- ఆద్యంతం ఉత్సాహం నింపిన ప్రసంగాలు
- తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు
- పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం

షాబాద్: మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు దీక్ష విజయవంతం కావడం పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. జిల్లా నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీక్షకు ముఖ్యఅతిథిగా హాజరైన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. జేసీబీ వాహనాలతో గులాబీ పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా నేతలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలు, అక్రమాలను ఎండగట్టారు. నేతల ప్రసంగాలు పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపాయి.

స్థానిక ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి

రైతులను ఆగం చేస్తున్న ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని మాజీ మంత్రి సబితారెడ్డి సూచించారు. కేసీఆర్ హయాంలో వర్షా లు పడే సమయానికి ఏడాదికి రెండుసార్లు రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమచేసేవారని గుర్తు చేశారు. ఫోన్లలో టింగ్‌టింగ్‌మని శబ్దం వచ్చేదన్నారు. రైతులను, మహిళలను ఆగం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు.

కాంగ్రెస్ కుట్రలను తిప్పికొడతాం

రైతులకు రుణమాఫీ, రైతుబంధు, 24 గంటల కరెంటు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని మాజీ మంత్రి మహమూద్ అలీ అన్నారు. రైతులు, మహిళలను మోసం చేసి గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని విమర్శించారు. కేటీఆర్‌ను జైలుకు పంపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని.. ఆ ప్రయత్నాలను తిప్పికొడతామని చెప్పారు.



రైతు దీక్షలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితారెడ్డి

దృష్టిని మరల్చేందుకే అక్రమ కేసులు

కేటీఆర్ కృషి ఫలితంగానే ఈ కార్ రేస్ మన రాష్ట్రానికి వచ్చిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. ఈకార్ రేస్‌లో పెట్టుబడులు పెట్టడంతో రాష్ట్రానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.700 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. కాంగ్రెస్ ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలు, హామీలు అమలు చేయకపోవడంతో ఎక్కడ తమను నిలదీస్తారనే భయంతో.. వారి దృష్టిని మరల్చేందుకే కేటీఆర్‌పై అక్రమ కేసు బనాయించారని ఆరోపించారు.



గులాబీ పూలతో కేటీఆర్‌కు ఘన స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ నాయకులు

అసత్య ప్రచారం సిగ్గుచేటు

తెలంగాణలో ఇచ్చిన హామీలను గంగలో కలిపిన సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఆరు గ్యారంటీలు, రుణమాఫీ చేసినట్లు చెప్పుకోవడం సిగ్గు చేటని బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ దుయ్యబట్టారు. గురుకుల హాస్టళ్లలో విద్యార్థులు విషపు ఆహారంతో అల్లాడినా ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. ఉచిత కరెంటు ఇవ్వలేదని, గ్యాస్ సబ్సిడీ లేదని, నెలకు రూ.2,500, కల్యాణలక్ష్మికి తులం బంగారం ఇవ్వడం లేదని విమర్శించారు.

హామీల అమలులో విఫలం

షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని, వాటిని ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగుదామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, బాల్క సుమన్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, బీఆర్ఎస్ యువనేతలు కార్తీక్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నాగేందర్‌గౌడ్, ఆంజనేయులు, స్వప్న, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. లగచర్ల రైతులకు మద్దతుగా నిలబడినందుకు తనను 35 రోజులు, రైతులను సంగారెడ్డి జైలులో పెట్టి కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని మండిపడ్డారు. రైతుభరోసా రూ.15వేలకు బదులు రూ.12వేలు ఇవ్వడాన్ని తప్పుబట్టారు. పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



రాంరెడ్డిపల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని డీసీసీ ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ నర్సింలుయాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామ పరిధిలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉన్న మట్టి రోడ్ల స్థానంలో సీసీ రహదారులను నిర్మించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌గుప్తా, లక్ష్మయ్యగౌడ్, చెన్నయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలుయాదవ్, కృష్ణయాదవ్, ఆంజనేయులుయాదవ్, రమేశ్, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

పశువుల పాక దగ్ధం

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం జనగాం గ్రామంలో గురువారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు పశువుల పాక దగ్ధమైంది. గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి వ్యవసాయంతో పాటు పశుపోషణ చేస్తుంటారు. ఇంటి ఆవరణలో ఉన్న పాకలో గేదెలను కట్టేశాడు. అర్ధరాత్రి దాటిన సమయంలో పాకలో ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. పశువులు అరవడంతో విష్ణువర్ధన్‌రెడ్డితో పాటు స్థానికులు లేచి నీళ్లతో పాకను ఆర్పేశారు. ఈ ప్రమాదంలో రెండు లేగదూడలు మృతి చెందగా, ఐదు గేదెలకు తీవ్ర గాయాలయ్యాయని బాధితుడు చెప్పారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



పూజలో పాల్గొన్న రమేశ్ తదితరులు

షాద్‌నగర్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని వీహెచ్‌పీ భాగ్యనగర్ క్షేత్ర సేవా ప్రముఖ్ బండారి రమేశ్ అన్నారు. సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని శుక్రవారం మిత్రా యూత్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో పట్టణంలోని గంజ్‌లోగల వినాయకస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీహెచ్‌పీ భాగ్యనగర్ క్షేత్ర సేవా ప్రముఖ్ బండారి రమేశ్, మున్సిపల్ చైర్మన్ నరేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సన్మార్గంలో నడుచుకొని సమాజానికి తమవంతుగా సేవ చేయాలన్నారు. దైవభక్తిని అలవర్చుకొని ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అభిలాష్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్, సంగమేష్, శేఖర్‌రెడ్డి, శ్రీధర్, రవి, శేఖర్‌అప్ప, గోపాల్, శ్రీకాంత్, శంకర్‌లాల్ లాహోటి, మహవీర్, భరత్, విష్ణుశర్మ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

చేవెళ్ల/మొయినాబాద్: చేవెళ్ల మండల పరిధిలోని ముడిమ్యాల గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. శుక్రవారం షాబాద్‌లో జరిగిన రైతు ధర్నా కార్యక్రమంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీజేపీ సీనియర్ నాయకుడు కరుణాకర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెద్దల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత దరఖాస్తులకే మొగ్గు

- రేషన్‌కార్డుల జారీలో కీలకంగా మారిన సర్వే
- ప్రజాపాలన అర్జీల ప్రకారం మంజూరు చేయాలని వినతి



బొంరాస్‌పేట: ఓ ఇంటి వద్ద సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

దుద్యాల్: ప్రభుత్వం చేపడుతున్న రేషన్ కార్డుల సర్వేతో ఆశావహులు సంబరపడ్డారు. కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్న ప్రజలకు తాజా సర్వేతో కొంత ఉపశమనం లభించింది. కానీ ప్రజాపాలనలో నమోదైన దరఖాస్తులు కాకుండా కొన్నేళ్ల క్రితం అప్లికేషన్ పెట్టుకున్న వాటినే రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నారు. దీంతో ఇటీవల నమోదు చేసుకున్న దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెళ్లై పిల్లలు పుట్టిన వారికి సైతం నేటికీ రేషన్‌కార్డులో పేరు లేకపోవడం ఏంటని ఆయా గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

దుద్యాల్‌లో 629

మండలంలో మొత్తం 629 రేషన్‌కార్డులకు సంబంధించి క్షేత్ర పరిశీలన రెండు రోజులుగా కొనసాగుతుంది. దుద్యాల్‌లో 84, సోమ్లనాయక్ తండాలో 12, అల్లిఖాన్‌పల్లి 26, లగచర్ల 47, రోటిబండతండా 12, ఈర్లపల్లి 19, సాగారం తండా 15, సత్తర్‌కుంట తండా 23, సంత్రకుంట తండా 8, హస్నాబాద్ 125, చెట్టుపల్లి 14, చిలుముల మైల్వార్ 25, నాజుఖాన్‌పల్లి 9, ఎక్కచెరువుతండా 15, హంసంపల్లి 15, హకీంపేట్ 19, పోలెపల్లి 27, ఆలేడ్ 30, కుదురుమల్ల 58, సంగాయిపల్లి 25 మంది ఆన్‌లైన్ దరఖాస్తులను రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారు.

ఇబ్బంది పడుతున్న ప్రజలు

ఏడెనిమిది ఏళ్ల క్రితం పెళ్లైన వారికి నేటికీ రేషన్ కార్డులో పేరు నమోదు కాలేదు. మండలంలోని హస్నాబాద్‌కు చెందిన చెన్నపాల్ల చెన్నకేశవులు, మహేశ్వరి అనే దంపతులకు 2019లో పెళ్లైంది. వారికి ముగ్గురు సంతానం. ఇంతవరకూ పిల్లల వివరాలతో తనవి రేషన్‌కార్డులో నమోదు కాలేదని మహేశ్వరి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు మండలవ్యాప్తంగా అనేకం ఉన్నాయి. పేర్లు లేకపోవడంతో ఇన్నేళ్లుగా రేషన్ బియ్యం కూడా రావడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి కొత్తగా పేర్లు నమోదు చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

త్వరలో దరఖాస్తులకు అవకాశం



పాత రేషన్ కార్డులో కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేసుకోవాలంటే మీ సేవాలో దరఖాస్తులు చేసుకోవాలి. వాటికి ప్రభుత్వం త్వరలో అవకాశం కల్పిస్తుంది. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం లేదు. గతంలో దరఖాస్తులనే ప్రస్తుతం పరిశీలిస్తున్నాం.

– కిషన్, తహసీల్దార్, దుద్యాల్

సర్వే సగం పూర్తి

కొడంగల్: రేషన్ కార్డుల కోసం నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే శుక్రవారం నాటికి సగం పూర్తి అయిందని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ఆయన పర్యటించారు. కొత్త రేషన్ కార్డుల కోసం నిర్వహిస్తున్న సర్వేను పారదర్శకంగా చేయాలని ఆదేశించారు. కొడంగల్ మండలంలో 1068 మంది, మున్సిపల్ పరిధిలో 294 మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ బలరాం నాయక్, డీటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్హుల గుర్తింపు

బొంరాస్‌పేట: మండలంలో రేషన్ కార్డుల సర్వే ముమ్మరంగా సాగుతోంది. శుక్రవారం రేగడిమైలారం, మూడుమామిళ్లతండా తదితర గ్రామాల్లో రెవెన్యూ అధికారులు, సిబ్బంది దరఖాస్తుదారుల ఇంటివద్దకు వెళ్లి సర్వే చేశారు. రేగడిమైలారంలో 53మంది, మూడుమామిళ్లతండాలో 18మంది దరఖాస్తుదారుల కుటుంబాలను పరిశీలించారు. ఎంపీడీఓ వెంకన్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యాలాలలో..

యాలాల: అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని యాలాల తహసీల్దార్ అంజయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని విశ్వనాథ్‌పూర్ గ్రామంలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సేకరించారు.

బంట్వారంలో..

బంట్వారం: రేషన్‌కార్డుల వెరిఫికేషన్ కొనసాగుతుంది. మండలంలోని తొర్మామిడి గ్రామంలో తహసీల్దార్ విజయ్‌కుమార్ శుక్రవారం రేషన్‌కార్డుల జాబితా ప్రకారం వివరాలు సేకరించారు. వెరిఫికేషన్ ఆధారంగా నమోదు చేసిన వివరాలను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు.

సర్వే షురూ

మోమిన్‌పేట: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో రేషన్ కార్డు సర్వే ప్రారంభమైంది. రెవెన్యూ అధికారులు దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి విచారణ చేపట్టారు. మండల వ్యాప్తంగా 812 మంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వివరాలను తీసుకొంటున్నారు.

తప్పులు ఉండొద్దు

దోమ: కొత్త రేషన్ కార్డు సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా నిర్వహించాలని తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీఓ మహేశ్‌బాబు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తున్న సర్వేను వారు పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.

దూసుకొచ్చిన మృత్యువు

- బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం
- డిగ్రీ విద్యార్థి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



వెంకటేశ్ (ఫైల్)



ఘటనాస్థలిలో క్షతగాత్రులు

బొంరాస్‌పేట: సంక్రాంతి సెలవులకు సొంతూరికి వచ్చిన ఓ విద్యార్థిని రోడ్డు ప్రమాదం బలి తీసుకుంది. కుటుంబసభ్యుడితో బయటికి వెళ్లిన అతడిపై మృత్యువు డీసీఎం రూపంలో దూసుకొచ్చింది. ఈ విషాద సంఘటన మండల పరిధిలోని మైసమ్మగడ్డతండా గేటు సమీపంలోని రంగయ్యవాడ్క కల్వర్టు వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. తండాకు చెందిన మాజీ ఉప సర్పంచ్ రాములునాయక్ కుమారుడు డేగావత్ వెంకటేశ్(21) జడ్చర్ల గురుకుల కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. రాములు నాయక్ తమ్ముడు పూల్యానాయక్ కొడుకైన డేగావత్ సంతోష్ వ్యవసాయం చేస్తున్నాడు. కాగా తన ఆరోగ్యం బాగోలేదని, ఆస్పత్రికి వెళ్దామని శుక్రవారం తన బైక్‌పై వెంకటేశ్‌ను తీసుకుని పరిగికి బయల్దేరారు. మార్గమధ్యలో పరిగి నుంచి కొడంగల్ వెళ్తున్న డీసీఎం అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనకాల ఉన్న వెంకటేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న సంతోష్‌కు తీవ్ర గాయాలవ్వగా పరిగి ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని కొడంగల్ మార్చురీకి తరలించామని ఎస్‌ఐ ఎండీ రవూఫ్ తెలిపారు. పండగ సెలవుల్లో ఇంటికి వచ్చిన తన కొడుకు చనిపోవడంతో తల్లిదండ్రులు, తండావాసులు పెట్టిన బోరున విలపించారు.

వాహన బీమా.. తస్మాత్ జాగ్రత్త!

- నగరంలో విస్తరించిన నకిలీ ముఠా
- పట్టుబడ్డ ముగ్గురు నిందితులు.. పరారీలో 11 మంది



నకిలీ బీమా ముఠా సభ్యుల నుంచి స్వాధీనం చేసుకున్న కంప్యూటర్లు, ఫోన్లు

శంషాబాద్: వాహనాలకు నకిలీ బీమాలు చేస్తున్న ఓ ముఠా గుట్టు రట్టయింది. వాహనదారులు ప్రమాదం జరిగిన తర్వాత సంబంధిత కంపెనీలకు క్లెయిమ్ చేయడంతో వీరి అసలు రంగు బయటపడింది. శంషాబాద్ పట్టణంలో నకిలీ ఇన్సూరెన్స్‌ల ద్వారా నష్టపోయిన వారు సైబరాబాద్ పోలీసులకు ఆశ్రయించడంతో నకిలీలకు పాల్పడుతున్న ముఠాలోని ముగ్గురిని శంషాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకుని ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

ఆర్టీఏ ఏజెంట్‌లే..

నకిలీ బీమాలు చేస్తున్న వారిలో ప్రధానంగా ఆర్టీఏ ఏజెంట్‌లే ఉన్నారు. ప్రధాన నిందితుడుగా కిషన్‌బాగ్‌కు చెందిన అవేస్ (32), శంషాబాద్ ఆర్‌బీనగర్ కాలనీలో నివాసముంటున్న నాగర్‌కర్నూల్‌కు చెందిన శ్రావణ్‌కుమార్‌గౌడ్(31) షాబాద్ మండలంలోని సర్దార్ నగర్‌కు చెందిన మోర్పు శశికుమార్‌లు ఈ దందా నడిపిస్తున్నారు. ఇందులో ఇద్దరు ఆర్టీఏ ఏజెంట్‌లుగా పని చేస్తున్నారు. ఈ ముగ్గురు కలిసి నగరలోని ప్రకాష్, అజీమ్, అస్లాం, శ్రీనివాసులు, మజహర్, రవికాంత్, లైకుద్దీన్, ఖాజా, ఐజాజ్, హసన్, రాములతో కలిసి నకిలీ బీమాల దందా కొనసాగిస్తున్నారు.

బాధితుల ద్వారానే..

నకిలీ ముఠా నుంచి ఓ ప్రైవేటు సంస్థ ద్వారా బీమా పాలసీలు పొందిన కొందరు బాధితులు వాహన ప్రమాదానికి గురైన తర్వాత సంబంధిత సంస్థలను ఆశ్రయించడంతో అవి నకిలీవిగా తేలాయి. దీంతో వారు పోలీసులకు ఆశ్రయించారు. ఎస్‌ఓటీ పోలీసులు నిఘావేసి శుక్రవారం ఉదయం ప్రధాన నిందితులైన ముగ్గురిని తొండుపల్లి వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి మూడు వాహనాలు, కంప్యూటర్లు, నకిలీ బీమా పత్రాలు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నగర వ్యాప్తంగా నకిలీ బీమా ముఠాకు చెందిన బాధితులు ఉన్నట్లు పోలీసులు గుర్తించి దర్యాప్తు చేస్తున్నారు.

సాగేతర భూముల సర్వే పరిశీలన



అగ్గనూరు శివారులో సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ హరిశంకర్ ప్రసాద్

యాలాల: రైతు భరోసా పథకంలో భాగంగా రెవెన్యూ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న సాగేతర భూముల సర్వేను తాండూరు సబ్ కలెక్టర్ హరిశంకర్ ప్రసాద్ పరిశీలించారు. శుక్రవారం మండలంలోని అగ్గనూరు క్లస్టర్ పరిధిలో జూనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, ఏఈఓ గోపి తదితరులు భూముల వివరాల సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా జుంటుపల్లి, అగ్గనూరు క్లస్టర్లలో ఉన్న భూముల వివరాలను జాగ్రత్తగా సేకరించాలన్నారు. అర్హులైన వారికి తప్ప, అనర్హులకు రైతు భరోసా అందరాదని పేర్కొన్న ప్రభుత్వ నిబంధనలు తూచ తప్పకుండా పాటించేలా చూడాలన్నారు.

వర్గీకరణతోనే ఉపకులాలకు న్యాయం



రథయాత్రలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తాండూరుకు చేరుకున్న రథయాత్ర

తాండూరు టౌన్: ఎస్సీ వర్గీకరణతోనే ఉపకులాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ అన్నారు. లక్ష డప్పులు, వేయి గొంతుల పేరుతో వచ్చే నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహా ప్రదర్శనలో భాగంగా నిర్వహిస్తున్న ప్రచార రథయాత్ర శుక్రవారం తాండూరు పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ చౌక్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ త్వరగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. వర్గీకరణ జరిగితేనే ఎస్సీ ఉపకులాలకు వాటా ప్రకారం న్యాయం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగానే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో భాగంగా లక్ష డప్పులు, వేయి గొంతుల ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాంచందర్ మాదిగ, ఆనంద్ మాదిగ, స్వామిదాస్, నర్సింలు, కృష్ణ, ప్రకాష్, మహేందర్, శివాజీ, బలరాం తదితరులు పాల్గొన్నారు.

కామాంధులకు రిమాండ్



అజిత్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం: బీటెక్ విద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడిన యువకుడిని ఇబ్రహీంపట్నం పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ కేపీవీ రాజు తెలిపిన వివరాల ప్రకారం... మంగళ్‌పల్లి క్రాస్ రోడ్డు వద్ద ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఖమ్మం జిల్లా విద్యార్థిని(18) గత బుధవారం అర్ధరాత్రి లైంగికదాడికి గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడైన నల్లగొండ జిల్లా గుర్రంపోడ్ మండలం జిన్నాయిచింత గ్రామానికి చెందిన ఎ.అజిత్(22)ను అరెస్టు చేసిన పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. హాస్టల్ భవన యాజమాని వద్ద అజిత్ డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

మరో ఘటనలో..

ఇబ్రహీంపట్నం రూరల్: వరసకు కూతురయ్యే బాలిక (14)పై లైంగిక దాడికి పాల్పడిన కామాంధుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఆంజనేయులు తన అన్న కూతురైన బాలికకు కొత్త దుస్తులు కొనిస్తానని చెప్పి గురువారం తుర్కయంజాల్ తీసుకువచ్చాడు. ఓ భవనంలో కొనసాగుతున్న ఓయో రూమ్‌కు తీసుకెళ్లి ఆమెపై అఘాయిత్యానికి ఒడిగట్టాడన్నారు. నిందితుడిని అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నగరానికి ఆనుకుని ఉన్న మున్సిపాలిటీలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పెద్దఅంబర్‌పేటలో శుక్రవారం పురపాలక సంఘం చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు అధ్యక్షతన జరిగిన పురపాలక సంఘం పాలకవర్గం సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పెద్దఅంబర్‌పేట, తుర్కయంజాల్, ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీల అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి రూ.114కోట్లు మంజూరు చేయించానన్నారు. సమీప ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు కాలనీల్లోంచి వచ్చే మురుగునీరు పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలోని పసుమాముల చెరువులో కలపడంతో స్థానికులు ఇబ్బందులు పడుతుండడంతో.. ఆ మురుగును మూసీ కాలువలో కలిపే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. నియోజకవర్గంలోని మున్సిపాలిటీలను గ్రేటర్‌లో విలీనం చేయకుండా ఉండాలని సీఎంని కోరగా.. కమిటీ వేసినట్లు తెలిపారని ఎమ్మెల్యే చెప్పారు.

పలు అంశాల తీర్మానం

కౌన్సిల్ సమావేశంలో ఎజెండాలోని పలు అంశాలపై చర్చించి ప్రతి వార్డు అభివృద్ధికి రూ.50లక్షల చొప్పున కేటాయించాలని తీర్మానించారు. తట్టిఅన్నారంలోని 16 కాలనీల మురుగు నీటిని తరలించేందుకు ట్రంక్ లైన్ నిర్మాణం కోసం రూ.10కోట్లు, పెద్దఅంబర్‌పేట–పసుమాముల వరకు మంజూరైన ట్రంక్ నిర్మాణం 2 కిలోమీటర్ల పొడిగింపు కోసం మరో రూ.6 కోట్లు కేటాయించాలని తీర్మానం చేశారు. వీటితో పాటు ఇటీవల పురపాలక సంఘం పరిధిలో విలీనమైన కుత్బుల్లాపూర్, బాచారం, గౌరెల్లి, తారామతిపేట గ్రామాల అభివృద్ధి కోసం ప్రతి గ్రామానికి రూ.25 లక్షల చొప్పున కేటాయించాలని కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో వైస్ చైర్మన్ చామ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గని భూముల్లో నయా దందా!



చదును చేసిన గని భూములు



భూమి చదును పనులు అడ్డుకుంటున్న తహసీల్దార్ వెంకటేశం

- వందేళ్ల నాపరాతి గనులను పూడ్చి సాగు యోగ్యతకు యత్నం
- కొర్విచెడ్‌లో కొసాగుతున్న అక్రమాలు
- అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

బషీరాబాద్: మండలంలోని కొర్విచెడ్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 116లో గల నాపరాతి గని భూములు చదును చేసే పనులు జోరుగా సాగుతున్నాయి. దశాబ్దాలుగా నాపరాతి గనులుగా వెలుగొందిన 15.04 ఎకరాల భూమిలో వందలమంది గని కార్మికులు నాపరాళ్లు కొట్టుకొని బతికారు. అయితే ఆ భూములు తమవేనంటూ కొందరు వారం రోజులుగా పెద్ద పెద్ద గుంతలను టిప్పర్‌లతో మట్టిపోసి చదును చేస్తున్నారు. గని భూముల్లో చదును చేయడం పూర్తిగా చట్టవిరుద్ధమని, ఎలాంటి అనుమతులు లేకుండా చదును ఎలా చేస్తారంటూ శుక్రవారం బషీరాబాద్ తహసీల్దార్ తన సిబ్బందితో వెళ్లి అడ్డుకున్నారు.

ఎటూ తేల్చుకోని అధికారులు

అయితే 116 సర్వేనంబర్ భూములు ప్రభుత్వానివా..? పట్టా భూములా అనేవి రెవెన్యూ అధికారులు సైతం తేల్చుకోలేక పోతున్నారు. ఈ క్రమంలో ఆ భూములను చదును చేసి సాగు యోగ్యత భూములుగా మార్చే పనులు వేగంగా చేస్తున్నారు. సాగు యోగ్యతగా మార్చితే సర్కారు నుంచి కూడా రైతు భరోసా పొందడంతో పాటు ఆ భూములకు మార్కెట్‌లో భారీ ధర పలికే అవకాశం ఉండడంతో సదరు వ్యక్తులు పనులను వేగవంతం చేశారు. దీనిపై గ్రామస్తులు, గని కార్మికుల నుంచి తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విచారణ జరపాలి

సర్వే నంబర్ 116లో 8 దశాబ్దాల నుంచి గనులు తవ్వుకొని బతికామని కొర్విచెడ్ గని గ్రామానికి చెందిన కార్మికులు చెబుతున్నారు. ఈ భూముల్లో అప్పట్లో సొసైటీ కూడా ఉండేదని, ప్రభుత్వ భూమిలేని వేంకటేశ్వర స్వామి ఆలయం కూడా నిర్మించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికీ ఆలయం ఉందని, అలాంటిది వారం రోజులుగా కొందరు బడా వ్యక్తులు వచ్చి భూములు తమవేనంటూ చదును చేయడం మాకే ఆశ్చర్యం వేస్తుందని గని కార్మికులు చెబుతున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు లోతుగా విచారణ జరిపితే తప్పా అసలు గుట్టు బయటపడుతుందని అంటున్నారు.

పనులు ఆపేశాం

కొర్విచెడ్‌గనిలోని సర్వేనంబర్116లో 15.04 ఎకరాల గని భూములు ఉన్నాయి. ఆ భూములు ముగ్గురు వ్యక్తులపై కొంత కాలం క్రితం పట్టాలు ఇచ్చారు. ఆ భూములు పట్టాభూములా..? సర్కారు భూముల అనేది సర్వేచేసి నిర్ధారిస్తాం. ప్రస్తుతానికి జరుగుతున్న చదును పనులకు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పనులను అడ్డుకున్నాం. ఒకటి రెండు రోజుల్లో సర్వేచేస్తాం. ప్రభుత్వ భూములైతే కచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశం, తహసీల్దార్, బషీరాబాద్

కాటమయ్య హుండీ చోరీ

- నగలు, కానుకలు ఎత్తుకెళ్లిన దుండగులు
- ఇన్నోవా కారులో వచ్చినట్లు చెబుతున్న స్థానికులు
- సీసీ పుటేజీలు పరిశీలిస్తున్న పోలీసులు



హుండీని పొదల్లో పడేసిన దుండగులు

ఇబ్రహీంపట్నం: గుర్తు తెలియని దుండగులు ఆలయంలోని హుండీని ఎత్తుకెళ్లిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని పోల్కంపల్లిలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ రామకృష్ణ, స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామ సమీపంలోని శ్రీకమహేశ్వరస్వామి (కాటమయ్య) ఆలయంలోకి చొరబడిన దుండగులు.. కానుకల హుండీని ఎత్తుకెళ్లారు. ఆలయానికి కొంత దూరంలో ఇనుప సుత్తి(గన్ను)తో హుండీని పగులగొట్టి, అందులోని నగదు, కానుకలను తీసుకెళ్లారు. చాలా బరువున్న హుండీని ఎత్తుకెళ్లడం ఒక్కరితో సాధ్యమయ్యే పనికాదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇన్నోవా కారులో వచ్చిన దుండగులే చోరీకి పాల్పడినట్లు అనుమానం వ్యక్తంచేశారు. శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చిన భక్తులు ఇది గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సమీపంలోని సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవలి కాలంలో పోల్కంపల్లిలోని మూడు ఆలయాల్లో వరుస చోరీలు జరగడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దొంగలను పట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆలయంలో హుండీ తస్కరణ

మంచాల: గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి హుండీ లూటీ చేసిన ఘటన మండలంలోని ఆరుట్ల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలోని దసరా బండ సమీపంలో గంగాదేవి–పెద్దమ్మ దేవాలయం ఉంది. అక్కడ అమ్మవారికి భక్తులు పూజలతో పాటు నగదు రూపంలో విరాళాలను హుండీలో సమర్పించుకుంటారు. గురువారం రాత్రి దుండగులు ఆలయ గ్రిల్స్ విరగొట్టి లోనికి ప్రవేశించి హుండీ తాళం పగలగొట్టి నగదు చోరీ చేశారు. అనంతరం రెండు కిలో మీటర్ల దూరంలో ఓ వ్యవసాయ పొలంలో హుండీని పడేశారు. శుక్రవారం ఉదయం గమనించిన సదరు రైతు గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుండీలో దాదాపు రూ.లక్ష వరకు నగదు ఉన్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.